క్లుప్తంగా

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు



బయ్యారం: మండలంలోని ఇల్లెందు–మహబూబాబాద్ ప్రధాన రహదారిపై తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్న ప్రాంతంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ తిరుపతిరావు మాట్లాడుతూ.. రహదారిపై రాకపోకలు కొనసాగించే వాహనదారులు హెచ్చరిక బోర్డులు ఉన్న ప్రాంతంలో జాగ్రత్తగా వాహనాలు నడిపి ప్రమాదాలను నివారించాలన్నారు. కార్యక్రమంలో గార్ల–బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సై తిరుపతి పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

మరిపెడ రూరల్: మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని ప్రసిద్ధిగాంచిన మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయం హుండీ లెక్కించగా, రూ.2,88,593 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వేణుగోపాల్ సోమవారం తెలిపారు. దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత, కార్య నిర్వాహణాధికారి కలకోట వేణుగోపాల్, వ్యవస్థాపక చైర్మన్ నల్లాన్ చక్రవర్తుల జగన్నాథాచార్యుల పర్యవేక్షణలో హుండీని లెక్కించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

తొర్రూరు రూరల్: ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ సూచించారు. మండలంలోని వెలికట్ట గ్రామంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కొనుగోలు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని ఆరబెట్టిన వెంటనే కాంటాలు పెట్టాలని, గాలివానలు వచ్చే అవకాశం ఉందని, ధాన్యాన్ని నిల్వ ఉంచకుండా ఎప్పటికప్పుడు కాంటాలు పెడుతూ పంపించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, టెంట్ వంటి సౌకర్యాలు కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి, ఆర్డీఓ గణేష్, తహసీల్దార్ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్‌రావు, సీఈఓ మురళి, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పీఓఎస్ మిషన్ ద్వారా తూకాలు

మహబూబాబాద్ రూరల్: పీఓఎస్ మిషన్ల ద్వారా పంట ఉత్పత్తులను తూకం వేసే ప్రక్రియను మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం ప్రయోగాత్మకంగా ప్రారంభించారు. ఏఎంసీ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్, సెక్రటరీ షంషీర్ వ్యవసాయ మార్కెట్‌లో ఉదయం ఈనాం ద్వారా కొనుగోళ్ల ప్రారంభం జరిగిన అనంతరం పీఓఎస్ మిషన్ల ద్వారా తూకం వేసే ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో మార్కెట్ సూపర్‌వైజర్ రమేశ్, అరుణ్ కుమార్, రవి పాల్గొన్నారు.

ప్రపంచ తెలుగు మహాసభలకు ఆహ్వానం

మహబూబాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన కవి, రచయిత, శుభోదయం, సాహిత్యం, సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ అధ్యక్షుడు సంకెపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కీర్తనా రెడ్డి దంపతులకు ప్రపంచ తెలుగు మహాసభలకు రావాలని ఆహ్వానం వచ్చింది. వచ్చే నెల 10, 11 తేదీల్లో ఏలూరులో జరిగే ప్రపంచ తెలుగు మహాసభలో వారు పాల్గొననున్నారు. ఆ సభలో కవిత గానం చేయనున్నట్లు పేర్కొన్నారు.

సీపీఐకి భాగస్వామ్యం కల్పించాలి



మహబూబాబాద్ రూరల్: ఇందిరమ్మ కమిటీల్లో, నామినేటెడ్ పోస్టుల్లో సీపీఐకి భాగస్వామ్యం కల్పించాలని కోరుతూ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డిని సీపీఐ నియోజకవర్గ నేతలు సోమవారం డీసీసీ కార్యాలయంలో కలిశారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి బి.అజయ్ సారధిరెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో నాయకులు పెరుగు కుమార్, రేషపల్లి నవీన్, కట్లోజు పాండురంగాచారి, చింతకుంట్ల వెంకన్న, వరిపెల్లి వెంకన్న, లింగ్యానాయక్ పాల్గొన్నారు.

ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

గార్ల: వారంరోజుల నుంచి మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీతో నీటి సరఫరా నిలిచిపోవడంతో గార్ల గ్రామ పంచాయతీ కార్యదర్శి అజ్మీర కిషన్ నీటి సరఫరా లేని ప్రాంతాల్లో వాటర్ ట్యాంకుల ద్వారా ప్రజలకు తాగునీటి సరఫరా చేశాడు. గార్లలోని హనుమంతుల బజారు, తహసీల్దార్ కార్యాలయం బజారు, వికలాంగుల కాలనీ నీరు సరఫరా సక్రమంగా లేకపోవడంతో, పంచాయతీ సిబ్బందితో వాటర్ ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు.

అంధులకు ఆపన్నహస్తం..

ప్రగతి సేవా సమితి స్వచ్ఛంద సంస్థ

- వినూత్న రీతిలో గ్రామాల్లో కంటి శుక్లం శస్త్ర చికిత్సల ప్రచారం
- చూపు మందగించిన వారిని గుర్తించి ఉచిత ఆపరేషన్లు
- సుమారు 713మందికి శస్త్ర చికిత్సలు



అబ్బాయిపాలెంలో ఉచిత కంటి శిబిరం (ఫైల్)

మరిపెడ రూరల్: సర్వేంద్రియానం నయనం ప్రధానం అన్నారు పెద్దలు. మనిషికి ఉన్న అవయవాల్లో అత్యంత సున్నితమైనది.. ప్రధానమైనది నేత్రాలే. వీటి పట్ల నిర్లక్ష్యంగా ఉంటే జీవితం చీకటిమయమే. ఈ అందమైన ప్రపంచాన్ని చూసే హక్కు ప్రతి ఒక్కరికి ఉంటుంది. పుట్టినప్పటి నుంచి ఈ ప్రపంచానికి శాశ్వతంగా దూరమయ్యే వరకు కళ్లు భద్రంగా చూసుకోవాల్సిందే. వీటి ప్రాధాన్యతను ప్రజలకు తెలియజేసేందుకు ప్రగతి సేవా సమితి స్వచ్ఛంద సంస్థ ఆరాటపడుతుంది. వినూత్న రీతిలో గ్రామాల్లో కంటి శుక్లం ఉచిత శస్త్ర చికిత్సలపై ప్రచారం నిర్వహిస్తున్నారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల జాన్ నిరుపేదలందరికి ఆర్థిక అక్షరాస్యతతోపాటు ఉచిత కంటి ఆపరేషన్ చేసి స్వచ్ఛమైన చూపును కల్పించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

ఆటో ద్వారా ప్రచారం..

ఓ ఆటోకు మైక్ పెట్టుకొని గ్రామాల్లో కలియ తీరుగుతున్నారు. విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నారు. గ్రామాల్లోని ఆదరణ లేని అంధులను గుర్తిస్తున్నారు. వారి వివరాలు సేకరిస్తున్నారు. శంకర్ కంటి ఆసుపత్రి హైదరాబాద్ వారిచే కంటి పరీక్షలు నిర్వహించి శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించి గత మూడు నెలలుగా 12 ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాలను నిర్వహించారు. ఇప్పటి వరకు చూపు మందగించిన 713 మందికి ఉచిత కంటి ఆపరేషన్లు చేసి స్వచ్ఛమైన చూపును ప్రసాదించగలిగారు.

నిరంతర ప్రక్రియ..



ప్రగతి సేవా సమితి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంటి ఆపరేషన్ శిబిరాలు నిరంతర ప్రకియగా నిర్వహిస్తాం. ఎంత మందికైన ఉచిత కంటి ఆపరేషన్లు చేయించి స్పష్టంగా ప్రపంచాన్ని చూసేలా చూపును కల్పిస్తాం. అంధులకు తాము అండగా ఉంటాం. వృద్ధాప్యంలో మస్కబారిని కంటి ఆపరేషన్ చేసి సమాజంలో గౌరవంగా జీవించేలా వారికి భరోసా కల్పిన్నాం.

– ఐనాల పరశురాములు, ప్రగతి సేవా సమితి జిల్లా కోఆర్డినేటర్

అడ్డంకులు సృష్టించినా సభ విజయవంతం

- మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్



మాట్లాడుతున్న రెడ్యానాయక్

కురవి: ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా సభ విజయవంతం అయిందని డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. మండలంలోని అయ్యగారిపల్లి గ్రామంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు ఆర్టీసీ బస్సులు కావాలని అడిగితే ఇవ్వలేదని, ప్రైవేట్ స్కూల్ బస్సుల కోసం అడిగితే స్కూల్ యజమానులకు జరిమానా విధిస్తామని లెటర్లు పెట్టారని ఆరోపించారు. వివిధ శాఖల అధికారులు రోడ్లపైకి వచ్చి వాహనాలు వెళ్లకుండా అడ్డుకున్నారన్నారు. నియోజకవర్గం నుంచి 10వేల మంది 600 వాహనాల్లో తరలివచ్చారని ఆయన తెలిపారు. సభకు వచ్చిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ చైర్మన్‌లు దొడ్డ గోవర్ధన్‌రెడ్డి, కొండపల్లి శ్రీదేవి, బజ్జూరి పిచ్చిరెడ్డి, గుడిబోయిన రామచంద్రయ్య, గుగులోతు రవినాయక్, నూతక్కి నర్సింహరావు, తిరుపతిరెడ్డి, బోజ్యానాయక్, దర్గయ్య పాల్గొన్నారు.

సభతో అయోమయంలో కాంగ్రెస్

తొర్రూరు: బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ విజయవంతంతో అధికార కాంగ్రెస్ అయోమయంలో పడిందని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, మాజీ జెడ్పీఫ్లోర్ లీడర్ మంగళపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం డివిజన్ కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనను రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని, అది రజతోత్సవ సభతో నిర్ధారణ అయ్యిందని తెలిపారు. ఈ సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రామిని శ్రీనివాస్, నాయకులు కుర్ర శ్రీనివాస్, ప్రమోద్, అంకూస్, కాలునాయక్ పాల్గొన్నారు.

ఇందిరాగాంధీని విమర్శించే స్థాయి లేదు



మాట్లాడుతున్న తాళ్లపల్లి కృష్ణగౌడ్

గార్ల: ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిన భారత రత్న, మాజీ ప్రధాని ఇందిరాగాంధీని విమర్శించే స్థాయి కేసీఆర్‌కు లేదని కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్ అన్నారు. సోమవారం గార్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ వనరులను కొల్లగొట్టి ప్రజాధనాన్ని కేసీఆర్ కుటుంబ ఆస్తులుగా మలుచుకున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ప్రకటించిన సోనియాగాంధీని విమర్శించే స్థాయి కేసీఆర్‌కు లేదన్నారు. ఈ సమావేశంలో శంషాద్‌బేగం, ధీకొండ రాము, పృథ్వీరాజ్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సౌకర్యం కల్పించాలి



మాట్లాడుతున్న పూణెం ప్రభాకర్

గంగారం: సాగునీటి సౌకర్యం కల్పించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు పూణెం ప్రభాకర్ అన్నారు. గంగారం మండల కేంద్రంలోని ఏఐకేయూకేఎస్ ప్రథమ మహాసభ సోమవారం కురుసం రంగయ్య, సువర్ణపాక నాగేశ్వర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెనుకబడిన ఏజెన్సీ ప్రాంతంలో అయితన గంగారం మండలంలో సాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. సాగునీరు లేక మండలంలో రైతాంగం వ్యవసాయాన్ని వదిలేసే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. అతివృష్టి, అనావృష్టి ద్వారా మండలంలో రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోతున్నారన్నారు. అనంతరం మండల నూతన కార్యవర్గం ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా కురుసం రంగయ్య ప్రధాన కార్యదర్శి సువర్ణపాక నాగేశ్వర్‌రావు, ఉపాధ్యక్షుడిగా జజ్జర వీరస్వామి, సహాయ కార్యదర్శిగా పులుసంనాగేశ్వర్ రావుతోపాటు తాటి రామయ్య, ఈసం బుచ్చిరాములు, జోగ వెంకటయ్య, తోలెం రాంబాబులు ఎన్నికయ్యారు.

వేధిస్తున్న వ్యక్తిపై చర్య తీసుకోవాలి

కురవి: ప్రేమించాలని, లేకుంటే చంపేస్తానని తన మేనకోడలి వెంట పడుతున్న బయ్యారం మండల కేంద్రానికి చెందిన విజయ్ అనే వ్యక్తిపై చర్య తీసుకోవాలని కురవి మండలం జగ్యాతండాకు చెందిన లూనావత్ శంకర్ సోమవారం కురవి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తన అక్క కుమార్తెను గత కొన్ని రోజులుగా బయ్యారానికి చెందిన విజయ్ అనే వ్యక్తి ప్రేమించాలని, పెళ్లి చేసుకోవాలని వేధిస్తున్నట్లు తెలిపారు.

విజయ్‌పై దాడి

ఈ క్రమంలో సోమవారం జగ్యాతండాకు ఆ అమ్మాయి కోసం వచ్చిన విజయ్‌పై, అమ్మాయి తరఫున చెందిన గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేయగా, తలకు బలమైన గాయమైనట్లు బాధితుడి బంధువులు తెలిపారు. గాయాలైన విజయ్‌ని బ్లూకోట్స్ పోలీసులు 108 అంబులెన్స్‌లో ఖమ్మం ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఈ రెండు ఘటనలపై వచ్చిన ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్లు కురవి ఏఎస్సై వెంకన్న తెలిపారు.

కారు పల్టీ.. ముగ్గురికి గాయాలు

మరిపెడ రూరల్: కారు అదుపు తప్పి పల్టీకొట్టిన సంఘటనలో స్వల్పగాయాలతో లంబాడీల ఐక్యవేదిక (లైవ్) రాష్ట్ర సమన్వయ కర్త జాదవ్ రమేశ్ నాయక్‌తోపాటు మరో ఇద్దరు బయటపడ్డారు. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా పురుషోత్తమాయగూడెం ఆకేరు వాగు బ్రిడ్జి సమీపంలో మాకుల జాతర రోజు ఈనెల 26వ తేదీన చోటుచేసుకోగా ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. కథనం ప్రకారం.. ఈనెల 26న లంబాడీల ఐక్యవేదిక రాష్ట్ర సమన్వయ కర్త జాదవ్ రమేశ్‌నాయక్ మరో ఇద్దరు యువకులతో కలిసి మరిపెడ మాకుల జాతరను సందర్శించుకుని ఓ పని నిమిత్తం తన సొంత కారులో డోర్నకల్ మండలం గొల్లచర్ల గ్రామం వెళ్లి తిరుగు స్వగ్రామానికి వస్తున్నారు. ఈక్రమంలో ఆకేరు వాగు బ్రిడ్జి సమీపంలో కారు అదుపు తప్పి పొలం మడికట్టులోకి పల్టీ కొట్టింది. ఈ సంఘటనలో అందులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు స్వల్పగాయాలతో బయటపడ్డారు.

తహసీల్దార్‌కు వినతి

దంతాలపల్లి: మండల కేంద్రంలో దొడ్డి కొమురయ్య విగ్రహ ఏర్పాటుకు సహకరించాలని తహసీల్దార్ సునీల్‌కుమార్‌కు సోమవారం తెలంగాణ యాదవ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఊడుగుల ఐలేష్ యాదవ్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. కొంత మంది నాయకులు విగ్రహాన్ని ప్రతిష్ఠించ వద్దని అడ్డుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువజన జిల్లా కార్యదర్శి ఆవుల సురేష్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఊడుగుల లింగన్న, బొల్లు వీరన్న, ఎడ్ల శ్రీను పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు

గూడూరు: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ బాలికల గురుకుల జూనియర్ ఇంటర్ గుమ్మడూరు కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు నోటిఫికేషన్ వెలువడినట్లు కళాశాల ప్రిన్సిపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆన్‌లైన్‌లో స్వీకరిస్తున్నట్లు, చివరి తేదీ మే12 వరకు ఉందన్నారు. మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు.

అమ్మాపురంలో దొంగల బీభత్సం

తొర్రూరు రూరల్: మండలంలోని అమ్మాపురం గ్రామానికి చెందిన ఓ ఇంట్లో దొంగతనం జరిగిన సంఘటన సోమవారం పట్ట పగలే చోటుచేసుకుంది. ఎస్సై ఉపేందర్ కథనం ప్రకారం.. మార్క పెద్ద లక్ష్మయ్య తన ఇంటికి తాళాలు వేసి కుటుంబ సభ్యులతో కలిసి వేరే గ్రామానికి వెళ్లగా, పట్టపగలే గుర్తు తెలియని వ్యక్తులు ఇంటికి ఉన్న రెండు తాళాలను పగులగొట్టి ఇంట్లోకి చొరబడి రూ.60వేల నగదు, నిత్యావసర వస్తువులను ఎత్తుకెళ్లారు. బాధిత లక్ష్మయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా

డోర్నకల్: మైనర్లు వాహనాలను నడపడంపై పోలీసులు ప్రత్యేక నిఘా పెడుతున్నారు. ఇటీవల మైనర్ల డ్రైవింగ్‌పై 'సాక్షి' దినపత్రికలో కథనం వెలువడటంతో సోమవారం పాతడోర్నకల్ పరిసరాల్లో ఎస్సైలు గడ్డం ఉమ, సత్యనారాయణ ఆధ్వర్యంలో వాహన తనిఖీ నిర్వహించి, వాహనాలు నడుపుతున్న మైనర్లను పట్టుకుని కౌన్సెలింగ్ నిర్వహించారు.

రైళ్లను పునరుద్ధరించాలి

డోర్నకల్: కరోనా కాలంలో రద్దయిన రైళ్ల సర్వీసులను పునరుద్ధరించాలని డీఆర్‌యూసీసీ సభ్యుడు మైనుపాషా సోమవారం ఖమ్మంలో ఖమ్మం పార్లమెంటు సభ్యుడు రామసహాయం రఘురామిరెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు.

మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలి



నెహ్రూసెంటర్: నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్: ఆపరేషనన్ కగార్ పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులపై దాడులను నిలిపివేసి మావోలను కేంద్ర ప్రభుత్వం శాంతి చర్చలకు పిలవాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య డిమాండ్ చేశాడు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ సెంటర్‌లో సోమవారం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్.లింగ్యా, దేవేందర్, సూర్యం, చైత్య, మధు, బాబన్న, హరీశ్, పద్మ, లక్ష్మయ్య, రాంచంద్రయ్య, మురళీ, వీరభద్రం, నాగేశ్వర్‌రావు, ఐలయ్య, మహేష్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

గార్ల: ఆపరేషన్ కగార్‌ను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం గార్లలో న్యూడెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ రాస్తారోకోను ఉద్దేశించి పార్టీ జిల్లా నాయకుడు జడ సత్యనారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సక్రు, గౌని భద్రయ్య, వీరభద్రం, మాన్యా, శ్రీరాములు, మనోహర్ పాల్గొన్నారు.

దాడులు ఆపాలి

నెల్లికుదురు: కర్రెగుట్ట ప్రాంతంలో ఆదివాసీ మావోయిస్టులపై జరుగుతున్న నరమేధాన్ని వెంటనే ఆపి పార్టీ నేతలతో చర్చలు జరుపాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ డివిజన్ నాయకుడు ఇరుగు అనిల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు మండలంలోని బంజర గ్రామంలో సోమవారం నిరసన వ్యక్తం చేసి మాట్లాడారు.

దంతాలపల్లి: ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని తొర్రూరు డివిజన్ సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ కార్యదర్శి ఊడుగుల లింగన్న అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ప్రజాసంఘాలు, ఉద్యమకారుల ఐక్యవేదిక సభ్యులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగన్న, యాకసాయిలు, నరేష్, సాయిలు పాల్గొన్నారు.

బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

నెల్లికుదురు: మత విద్వేశాలను రెచ్చగొడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెచ్చిన రాజ్యాంగాన్ని మార్చాలనే బీజేపీ కుట్రను తిప్పికొట్టాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గొల్లపల్లి ప్రభాకర్ గౌడ్ ప్రజలకు పిలుపునిచ్చాడు. ఏఐసీసీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహిస్తున్న జై బాపు, జై బీం, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేచరాజుపల్లి, పెద్దతండా గ్రామాలల్లో సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేద ప్రజల కోసం అందిస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎదళ్ల యాదవ రెడ్డి, జిల్లా కార్యదర్శి కాసం లక్ష్మారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలాజీనాయక్, నాయకులు సత్యపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, రామారావు, వంశీ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ చరిత్రను వక్రీకరిస్తున్నారు..



మాట్లాడుతున్న బుచ్చిరెడ్డి

మరిపెడ రూరల్: సుమారు 400 ఏళ్ల నాటి మాకుల వేంకటేశ్వరస్వామి ఆలయ చరిత్రను వక్రీకరిస్తున్నారని మరిపెడ మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ ముదిరెడ్డి బుచ్చిరెడ్డి అన్నారు. సోమవారం ఆలయంలో ఆయన మాట్లాడారు. మాకుల ఆలయాన్ని పూర్వీకుల కాలం నుంచి కూడా వేంకటేశ్వర స్వామిగానే కొలుస్తూ ఇక్కడి ఆలయ సంప్రదాయాలు పాటిస్తు వస్తున్నామన్నారు. ఇంతకాలం తర్వాత ఆలయంలో వేంకటేశ్వర స్వామి విగ్రహం కాదని, బావుసింగ్ బాబా అని కొందరు స్థానికేతరులు కులాల మధ్య చిచ్చుపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మజీ ఉపసర్పంచ్ గంట్ల రంగారెడ్డి, బోడ రమేష్‌నాయక్, ఆలయ చైర్మన్ ఎన్‌సీహెచ్ జగన్నాథచార్యులు, ఈఓ వేణుగోపాలు, అర్చకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సిమెంట్ బెంచీల ఏర్పాటు



కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రంలో పశువైద్యకేంద్రంలో, జమ్మిచెట్టు వద్ద, వడ్డెరకాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద, దుర్గమ్మ గుడి వద్ద ఓర్సు రాములు, ఎల్లమ్మ జ్ఞాపకార్థం, వారి మనుమలు ఓర్సు సంపత్ బ్రదర్స్ ఆధ్వర్యంలో రూ.20వేల విలువైన సిమెంట్ బెంచీలను సోమవారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి రవీందర్, వేముల శ్రీనివాస్, ఓర్సు సంపత్, వీరన్న, సురేష్, ఇద్దయ్య పాల్గొన్నారు.

పింఛన్లు మంజూరు చేయండి

గూడూరు: ప్రజాపాలనతో చేయూత పింఛన్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న అర్హులందరికీ వెంటనే మంజూరు చేయాలని వికలాంగ హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి డిమాండ్ చేశాడు. మండలంలోని ఆయోధ్యపురంలో సోమవారం ఏర్పాటు చేసిన వీహెచ్‌పీఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరికీ పింఛన్ అందించాలన్నారు.

మోటార్ సైకిల్ పైనుంచి పడి గాయాలు

నెల్లికుదురు: మండలంలోని మదనతుర్తి గ్రామానికి చెందిన కొమ్మనబోయిన వీరన్న సోమవారం మోటార్ సైకిల్‌పై వెళ్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో అతడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు 108వాహనంలో మహబూబాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడాలి

గూడూరు: భూమి, భుక్తి కోసం పోరాడి అమరులైన వారి ఉద్యమ స్ఫూర్తితో, ప్రజావ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర పాలకులపై పోరాడాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ అమరవీరుల స్థూపం వద్ద సోమవారం నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నూకల ఉపేందర్‌యాదవ్, బందెల వీరస్వామి, కటకం బుచ్చిరాములు పాల్గొన్నారు.

వేసవిలో శిక్షణ ఇవ్వొద్దు

బయ్యారం: వేసవికాలంలో ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వొద్దని టీఎస్ టీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎం.భద్రునాయక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బయ్యారంలో ఆయన మాట్లాడారు. ఎండ వేడిమి ఎక్కువగా ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు.

క్షుద్రపూజల కలకలం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని తలారి వెంకటేశ్వర్లు కాలనీ సమీపంలో క్షుద్ర పూజలు జరిగాయనే ప్రచారం స్థానికంగా కలకలం రేపింది. అమావాస్య సందర్భంగా ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్ర పూజలు చేసి రోడ్డుపై నిమ్మకాయలు, కొబ్బరికాయ పూజా సామగ్రి ఏర్పాటు చేశారు. ఆదివారం అమావాస్య రావటంతో కొందరు వ్యక్తులు క్షుద్రపూజలు చేసినట్లుగా అనుమానిస్తూ స్థానికులు భయాందోళనకు గురయ్యారు.

మలిదశ ఉద్యమకారుడి మృతి



బుచ్చిరెడ్డి (ఫైల్)

బయ్యారం: తెలంగాణ మలిదశ ఉద్యమంలో మండలంలో కీలకపాత్ర పోషించిన రెంటాల బుచ్చిరెడ్డి (65) ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. తెలంగాణ సాధన కోసం నాటి టీఆర్‌ఎస్ పక్షాన నిర్వహించిన అనేక ఉద్యమాల్లో పాల్గొని జైలు జీవితం సైతం గడిపారు. టీఆర్‌ఎస్ ఉమ్మడి ఖమ్మం జిల్లా కార్యదర్శిగా, మండల అధ్యక్షుడిగా పనిచేశారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, న్యూడెమోక్రసీ, మాస్‌లైన్, సీపీఎం, సీపీఐ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

ఫ్లెక్సీల విషయంలో గొడవ

దంతాలపల్లి: మండలకేంద్రంలో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీల కోసం గొడవపడిన సంఘటన మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. నేడు మండలానికి భూభారతి కార్యక్రమంపై అవహన కల్పించడం కోసం మంత్రి పొంగిలేటి శ్రీనివాస్‌రెడ్డి రానున్నారు. ఈక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడికి, ఓ సీనియర్ నాయకుడికి ఫ్లెక్సీల మధ్య వివాదం చోటుచేసుకుంది.

భరత నాట్యంలో అలరించిన రష్మిక



చిన్నగూడూరు: మండల కేంద్రానికి చెందిన గాడిపెల్లి శ్రీను–సరిత దంపతుల కుమార్తె రష్మిక గౌతమి హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆకట్టుకునేలా భరత నాట్య ప్రదర్శన చేసి పలువురి నుంచి ఆమె అభినందనలు అందుకుంది.

జాబితాను గుట్టుగా ఉంచడం సమంజసం కాదు

గార్ల: ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాను నోటీస్ బోర్డులో పెట్టమంటే, కలెక్టర్ జాబితాను బహిరంగ పర్చవద్దన్నారని ఎంపీడీఓ మంగమ్మ సమధానం చెప్పడంపై మాజీ ఎంపీపీ మాలోత్ వెంకట్‌లాల్ ఆవేదన వ్యక్తం చేశాడు. సోమవారం గార్లలో ఆయన మాట్లాడారు. ఎంపీడీఓ జాబితాను గుట్టుగా ఉంచడం సమంజసం కాదన్నారు. ఇట్టి విషయంపై త్వరలో కలెక్టర్‌ను కలిసి ఎంపీడీఓపై ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే

డోర్నకల్: మండలంలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గుర్తింపు కోసం సర్వే కొనసాగుతోంది. ఇప్పటికే పలుమార్లు సర్వే నిర్వహించగా ప్రస్తుతం గెజిటెడ్ వెరిఫికేషన్ అధికారులు గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నారు. 900 దరఖాస్తుల నుంచి 427 మంది లబ్ధిదారులను ఎంపిక చేయాల్సి ఉంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



కొత్తగూడ: మండలంలోని పొగుళ్లపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 2013–14లో పదో తరగతి చదువుకున్న విద్యార్థులు అదే పాఠశాలలో సోమవారం కలుసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు రాంచందర్, లక్ష్మినారాయణ, సురేందర్, శ్యాం సుందర్‌రెడ్డి, అంజయ్య, శ్రీధర్‌లను ఘనంగా సన్మానించారు.